'కేవీపీఎస్' శిక్షణ తరగతుల పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కృష్ణ

శాలిగౌరారం, జూన్ 22: ఈనెల 23న కట్టంగూర్‌లో జరిగే కేవీపీఎస్ జిల్లాస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఒంటిపాక కృష్ణ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని బొల్లారం యాదగిరి భవనంలో సంఘం శిక్షణా తరగతులకు సంబంధించిన శిక్షణ తరగతుల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞానం సమాజ మార్పునకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మల్లయ్య, బుచ్చిరాములు, లింగయ్య, సత్యనారాయణ, ఆంజనేయులు ఉన్నారు.

కేటీఆర్‌ను కలిసిన బుసిరెడ్డి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పూల బొకే అందిస్తున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి

పెద్దవూర, జూన్ 22: లండన్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో జరుగుతున్న ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. ఈ మేరకు 'ఫ్రాంటియర్ టెక్నాలజీస్ ఫర్ డెవలప్‌మెంట్ ఇన్ ఇండియా' అనే అంశంపై కేటీఆర్ ప్రసంగించారు. అంతకుముందు కేటీఆర్‌ను బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి కలిసి పూల బొకే అందించి ఆహ్వానించారు. ఆయన వెంట సామల అజయ్ రెడ్డి, నల్లగొండ గ్రంథాలయ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గీత కార్మికుడికి ఆర్థికసాయం

కట్టంగూర్, జూన్ 22: మండలంలోని కల్మెర గ్రామానికి చెందిన శంకరయ్య ఇటీవల ప్రమాదవ శాత్తు తాటిచెట్టుపై నుంచి కిందపడడంతో తీవ్రగాయాలై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ ఆదివారం శంకరయ్యని పరామర్శించారు. అనంతరం రూ.5వేల ఆర్థికసాయం అందించారు. బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఊట్కూరి ఏడుకొండలు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నూకత సైదులు, మల్లేష్, రమేష్, శిశుపాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, జాన్‌రెడ్డి, సోమయ్య, రాములు, లింగయ్య, లక్ష్మి, నరేష్, నాగయ్య, నర్సింహ, రాజు ఉన్నారు.

పేదలకు దక్కని ఇందిరమ్మ ఇండ్లు

బీఆర్ఎస్ నాయకుడు రాపాక రాజు

శాలిగౌరారం, జూన్ 22: ఇందిరమ్మ ఇండ్లు అసలైన నిరుపేదలకు దక్కడం లేదని, ఇండ్లు ఉన్న వారికే మళ్లీ మంజూరు చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాపాక రాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం శాలిగౌరారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పార్టీలకు అతీతంగా ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించి మంజూరు చేయాలని కోరారు. చిన్న గ్రామాలకు 50, పెద్ద గ్రామాలకు 100 చొప్పున ఇండ్లు మంజూరు చేసి నిరుపేదలకు న్యాయం చేయాలన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

చిట్యాల, జూన్ 22: అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి, సహాయ కార్యదర్శులు ఎండీ అక్బర్, జిల్లా సత్యం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ పార్టీ కార్యకర్తలను లబ్ధిదారుల జాబితాలో చేర్చేలా అధికారులను ఒప్పించారని ఆరోపించారు. అసలైన పేదవాళ్లను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఘనంగా అమ్మవారి మంగళ నీరాజన దర్శనం

అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నల్లగొండ సిటీ, జూన్ 22: ధర్వేశిపురం రేణుకే ఎల్లమ్మ అమ్మవారికి మంగళ నీరాజన దర్శనం నిర్వహించారు. జేష్ఠ బహుళ ఆదివారం సందర్భంగా అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగోజు మల్లాచారి ఆధ్వర్యంలో లలితా సహస్ర నామాలతో విశేషంగా కుంకుమ పూజలు చేసి భక్తులకు అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

సినీ కార్మికుల సంక్షేమానికి అహర్నిశలు కృషి

- నేటి తరానికి ప్రభాకర్ రెడ్డి సేవలు గుర్తుండాలి
- పుస్తకావిష్కరణలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రచయితలు

రామగిరి, జూన్ 22: నల్లగొండ జిల్లాకు చెందిన ప్రముఖ నటుడు, నిర్మాత డాక్టర్ ఎం.ప్రభాకర్‌రెడ్డి సినీ జీవితంపై నల్లగొండ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి, రచయిత, కవి అంజయ్య పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకాన్ని ఆదివారం నల్లగొండలోని తన నివాసంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సినీ కార్మికుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన క్యారెక్టర్ ఆర్టిస్టు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జీవిత చరిత్రతో పుస్తకం రాయడంతో నేటి తరానికి ఆయన సేవలు గుర్తు చేసినట్లు అని అభినందించారు. ఈ కార్యక్రమంలో రచయిత పున్న అంజయ్య, ఫిలిం సొసైటీ సభ్యులు, జిల్లా రచయిత సంఘం అధ్యక్షుడు మేరేడ్డి యాదగిరిరెడ్డి, కోమలి కళా సమితి అధ్యక్షుడు బక్క పిచ్చయ్య, పెందోట సోము, బండారు శంకర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

22 బస్తాల నల్ల బెల్లం, 10 కిలోల పట్టిక పట్టివేత

పట్టుబడిన నల్లబెల్లం, పట్టికతో నల్లగొండ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ సంతోష్

కొండమల్లేపల్లి, జూన్ 22: మండల కేంద్రంలోని హైదరబాద్ రోడ్డులో ఆదివారం 22 బస్తాల నల్లబెల్లం, 10 కిలోల పట్టిక పట్టుబడింది. నల్లగొండ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయ అసిస్టెంట్ కమిషనర్ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ రోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా.. డిండి మండలంలోని బొగ్గులదొన గ్రామానికి చెందిన బాలకోటి తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ అధికారులను గమనించి కారును అక్కడే వదిలి పారిపోయాడు. పోలీసులు కారులో తనిఖీలు చేయగా.. అక్రమంగా తరలిస్తున్న 22 బస్తాల నల్లబెల్లం, 10 కిలోల పట్టిక లభించింది. దీంతో వాహనాన్ని సీజు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీని విలువ రూ.6 లక్షలు ఉంటుందని తెలిపారు. అయన వెంట సీఐ రాకేష్, శేఖర్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

నార్కట్‌పల్లి జూన్ 22: మండలంలోని అమ్మనబోలులో కాంగ్రెస్ నాయకుడు మధుసూదన్ రెడ్డి తల్లి ఇటీవల మృతిచెందింది. ఈ మేరకు ఆదివారం ఆమె దశదిన కర్మ నిర్వహించగా.. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు మండల మాజీ కన్వీనర్ అశోక్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభలకు ఎంపిక

ఖమ్మంపాటి శంకర్

నీలగిరి, జూన్ 22: ఎస్ఎఫ్ఐ జాతీయ 18వ మహాసభలకు జిల్లా నుంచి ఐదుగురు ప్రతినిధులు ఎంపికైనట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఖమ్మం పాటి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి 30 వరకు కేరళ రాష్ట్రం కొచ్చి కోడ్‌లో జరగనున్న మహాసభలకు తనతో పాటు నరేష్, కావ్య, స్పందన, సైదా నాయక్ ప్రతినిధులుగా పాలొంటున్నారని తెలిపారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై అనేక తీర్మానాలు చేయనున్నామన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

చిట్యాల, జూన్ 22: అక్రమంగా ఓ వ్యక్తి 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ అమ్రీన్ నసీన తెలిపారు. వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా భువనగిరి మండలం పచ్చలబోడు తండాకు చెందిన గుగులోతు మనేందర్ చిన్నకాపర్తి, ఆరెగూడెం గ్రామాలలో రేషన్‌కార్డుదారుల నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాడు. సమాచారం మేరకు అతడిని వెంబడించగా సేకరించిన బియ్యాన్ని బస్తాలలో నింపడానికి చిన్నకాపర్తిలోని ఓ ఖాళీ స్థలంతో భద్రపరిచినట్లు తెలిసింది. ఈ మేరకు 10 క్వింటాళ్ల బియ్యంతోపాటు, స్కూటీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆమె వివరించారు.

ఇన్‌చార్జ్ ఎస్ఐగా నసీన

చిట్యాల, జూన్ 22: మండల ఇన్‌చార్జ్ ఎస్ఐగా అమ్రీన్ నసీన నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన ఎన్.ధర్మవీఆర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో చిట్యాలలో ట్రైనీ ఎస్ఐగా పనిచేస్తున్న నసీన ఇన్‌చార్జ్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు.

ఆలయ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

గణేష్ మార్కెట్ ఆలయ వార్షికోత్సవ లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, జూన్ 22: పట్టణంలోని గణేష్ మార్కెట్‌లోని విఘ్నేశ్వర దేవాలయ 50వ నవరాత్రి వార్షికోత్సవ వేడుకల లోగోను ఆదివారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 5వరకు జరిగే 50వ వార్షికోత్సవ వేడుకలను భక్తులు విజయవంతం చేయాలన్నారు. ఈ వార్షికోత్సవానికి తనవంతుగా సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పాలిశెట్టి యాదగిరి, అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

ఎస్ఐ లక్ష్మయ్య

యాద్గార్‌పల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మయ్య

మిర్యాలగూడ, జూన్ 22: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య అన్నారు. ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో విలేజ్ పోలీస్ ఆఫీసర్లతో కలిసి నాసా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా యువతకు, గ్రామస్తులకు మాదక ద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్‌లకు అలవాటు పడి భవిష్యత్తును పాడుచేసుకోవద్దన్నారు. మాదకద్రవ్యాలతో కలిగే దుష్పరిణామాలను యువతకు వివరించారు. ఎవరైనా గంజాయి విక్రయించడం, కొనుగోలు చేసే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

యోగాతో మెరుగైన ఆరోగ్యం

జైలు సూపరింటెండెంట్ గౌర ప్రమోద్

జిల్లా జైలులో యోగా నిర్వహిస్తున్న జైలు సూపరింటెండెంట్ గౌర ప్రమోద్

నీలగిరి. జూన్22: యోగాతో ఒత్తిడిని అధిగమించడంతో పాటు ఆరోగ్యం మెరుగుపడుతుందని జైలు సూపరింటెండెంట్ గౌర ప్రమోద్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ సౌమ్య మిశ్రా ఆదేశాల మేరకు జిల్లా కేంద్ర కారాగారంలో విశేష యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో ఒత్తిడి నిర్వహణ, ఆత్మపరిశీలన, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంతో ఖైదీల్లో ఆత్మశుద్ధి, ఆత్మవిశ్వాసం, ఆరోగ్య అభివృద్ధిపై అవగాహన పెరిగిందన్నారు. గత 10 రోజులుగా ప్రముఖ యోగా గురువు కరుణాకర్ సారథ్యంలో ఖైదీలకు, సిబ్బందికి యోగాసనాలు, ధ్యానం, యోగా సిద్ధాంతాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు ముగింపు చిహ్నంగా సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు. ఖైదీలతో పాటు జైలు సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో జైలర్ బాలకృష్ణ, అధికారులు వెంకట్ రెడ్డి, చింత వెంకటేశ్వర్లు, శ్రీ రామ్, ప్రకృతి ప్రేమికుడు సురేష్ గుప్తా పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలకు బోర్ మోటర్ అందజేత

మోటర్ అందజేస్తున్న కస్తూరి చరణ్

కొండమల్లేపల్లి, జూన్ 22: మండలంలోని కోల్‌ముంతల్ పహడ్ గ్రామపంచాయతీలోని దేవరకొండ రోడ్డులో నూతనంగా నిర్మించిన కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి కస్తూరి ఫౌండేషన్ సభ్యులు బోర్ మోటర్ అందజేశారు. పాఠశాలలో విద్యార్థులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నట్లు కస్తూరి ఫౌండేషన్ సభ్యుడు పిన్నింటి నరేందర్‌రెడ్డికి సమాచారం అందింది. ఈ మేరకు ఆదివారం పాఠశాల సిబ్బందికి మోటర్ అందజేశారు. ఈ సందర్భంగా కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి చరణ్‌కు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సరళ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాలి

– కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు

మాట్లాడుతున్న తప్పెట్ల స్కైలాబ్ బాబు

కట్టంగూర్, జూన్ 22: కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. కట్టంగూర్ వైవీఆర్ పంక్షన్‌హాల్ కేవీపీఎస్ జిల్లా స్థాయి శిక్షణ తరగతులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధికి కుల వ్యవస్థ ఆటంకంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున, కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు పరుశరాములు, రాధిక, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణ, విజయ్‌కుమార్, నర్సింహ, శ్రీను, రవీంద్రకుమార్, మల్లన్న, విజయ్‌కుమార్, సైదులు, రవి, దేవయ్య, శ్యామ్, రవి, వెంకన్న, రామస్వామి, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

డీఎల్‌డీఏలో సూపర్‌వైజర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ, జూన్ 22: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు సూపర్‌వైజర్ పోస్టు ఖాళీగా ఉందని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఈవో రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెటర్నరీ పాలిటెక్నిక్, డిప్లొమా, డైరీ సైన్స్ లేదా గోపాల మిత్రగా పనిచేసిన వారు అర్హులుగా పేర్కొన్నారు. 18 నుంచి 40 ఏండ్ల వయసు ఉండటంతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 26వ తేదీలోగా జిల్లా కేంద్రంలోని పానగల్ రోడ్డులో ఉన్న డీఎల్‌డీఏ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మిగతా వివరాలకు నెంబర్.85230 23423ను సంప్రదించాలన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

– మాజీ జడ్పీటీసీ యాదగిరి

బహుమతులు అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ యాదగిరి

కట్టంగూర్, జూన్ 22: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని విన్నర్‌గా నిలిచిన నల్లగొండ జట్టుకు రూ.30వేలు, రన్నర్‌గా నిలిచిన జట్టుకు మిట్టపల్లి శివ రూ.20 వేల నగదుతో పాటు ఆయా జట్లకు షీల్డ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, స్వామి, అంజన్‌కుమార్, సైదులు, లింగయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని రోడ్డుపై పడిన కంటైనర్

రోడ్డుపై అడ్డంగా పడిన కంటైనర్ వాహనం

వేములపల్లి, జూన్ 22: డివైడర్‌ను ఢీకొని కంటైనర్ వాహనం రోడ్డుపై అడ్డంగా పడిన సంఘటన మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. తమిళనాడుకు చెందిన కంటైనర్ డ్రైవర్లు కాశీప్రభ, విజయ్‌రాజ్‌లు నల్లగొండ నుంచి తమిళనాడుకు వెళ్తుండగా.. ఆదివారం వేములపల్లి మండల కేంద్రానికి చేరుకోగానే కంటైనర్ డ్రైవర్ కాశీప్రభ నిద్రలోకి జారుకోవడంతో వాహనం అదుపుతప్పింది. దీంతో కంటైనర్ డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఈ సంఘటనలో డ్రైవర్ కాశీప్రభకు స్వల్ప గాయాలవ్వగా.. విజయ్‌రాజ్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. కంటైనర్ వాహనం రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో పోలీసులు క్రేన్ల సహాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

అక్రమ డిప్యూటేషన్స్ నిలిపివేయాలి

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి

మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి

రామగిరి, జూన్ 22: నల్లగొండ జిల్లాలో కొంత మంది రాజకీయ నాయకుల అండదండలతో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిప్యూటేషన్స్‌తో వెళ్తున్నారని, వీటిని తక్షణ నిలిపివేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆ సంఘం జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశానికి హాజరై మాట్లాడారు. జిల్లాలోని పీఏపల్లి, గుడిపల్లి, అడివిదేవులపల్లి, చండూరు మండలాల నుంచి జాతీయ రహదారికి దగ్గరలో ఉన్న మండలాలలు కట్టంగూర్, నకిరేకల్లు, కేతేపల్లి మండలాలకు అక్రమంగా వెళ్లారని తెలిపారు. తక్షణమే వీటిని రద్దు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమళ్ల వెంకటేశం, నాయకులు నాగమణి, నల్లపరాజు వెంకన్న, వేదశ్రీ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ

- నిండిపోయిన మురుగు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

నకిరేకల్ : మూసీరోడ్డులోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట నిలిచిన మురుగు

నకిరేకల్, జూన్ 22: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 20వార్డులలో దాదాపు 15 వార్డులలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రధానంగా నకిరేకల్ పట్టణంలోని మూసీరోడ్డు ప్రారంభంలో సులభ్ కాంప్లెక్స్, చికెన్ సెంటర్ల మధ్యలో రహదారిపై మురుగునీరు నిలిచింది. దీంతో ప్రయాణికులతో పాటు వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. అయితే మూసీరోడ్డులోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ముందు డ్రైనేజీలో సులభ్‌కాంప్లెక్స్ నుంచి వచ్చే మురుగునీరు, చికెన్ సెంటర్లలోని కోళ్ల వ్యర్థాలు చేరుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా.. కనీసం శుభ్రం చేసే నాథుడే లేకపోవడంతో మురుగు నీరంతా ఎక్కడికక్కడ నిలిచిపోయింది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విపరీతంగా దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు వృద్ధి చెంది ఆ ప్రాంతమంతా విజృంభిస్తున్నాయి. మరోవైపు భారీ వర్షాలు పడితే డ్రైనేజీలోని మురుగు ఎంపీడీఓ కాంప్లెక్స్ షాపులలో చేరుతుందని వ్యాపారులు వాపోతున్నారు. కంపు కొడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను బాగుచేయాలని ప్రయాణికులు, వ్యాపారులు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS
FOR SALE
★ సూర్యాపేట పాత మెయిన్ రోడ్డులో 600 చ||గజాల నాగేంద్ర కిరాణం, శ్రీనివాసు అపరాల షాపు వెనుక Sale / Development చేయుటకు గలదు. సంప్ర : 9848948440
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount 5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, (గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ: 9182777625, 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638

ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ అజెండా

సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

గుర్రంపోడ్‌లో సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

గుర్రంపోడ్,జూన్ 22: ప్రజా సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రజలకు సీపీఐ అండగా పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సీపీఐ మండల 15వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా బడుగు, బలహీన వర్గాలను ఏకం చేసి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి సీపీఐ నాయకత్వం వహించిందన్నారు. బీజేపీ ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించిందన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేసి జిల్లాకు సాగునీరు అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నరసింహ రెడ్డి అన్నారు. నకిలీ విత్తనాలు అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజాచారి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి జగన్, మండల కార్యదర్శి లక్ష్మీపతి, నాంపల్లి మండల సీపీఐ కార్యదర్శి రమేష్, మాజీ జడ్పీటీసీ వెంకటయ్య, నాయకులు రామచంద్రరావు, షేక్ మదార్, శంకరాచారి, యాదయ్య, నరసింహ, షేక్ అమీర్, అంజయ్య, ఇస్తారీ, శ్రీను, నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.